
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 22 మే 2024

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి - 8లో..

హామీలను అమలు చేయాలి - 8లో..



ఆందోళనలో అన్నదాత



కోనరావుపేటలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

- చివరి దశకు చేరిన ధాన్యం కొనుగోళ్లు
- రవాణా లేక రైతుల నిరసనలు
- మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడన భయం
- యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తప్పిన లెక్క
- లక్ష్యం 3 లక్షల మెట్రిక్ టన్నులు
- 2.18 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- 31,417 మంది రైతులకు రూ.387 కోట్ల చెల్లింపు
- ఇప్పటికే 95 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

భూతల్లిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రతి సీజన్‌లోనూ రైతులకు కష్టాలు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయకపోవడం, రవాణా సౌకర్యాన్ని సమకూర్చుకోకపోవడం వంటి సమస్యలకుతోడు అకాల వర్షాలతో అన్నదాతలు అలజడికి గురవుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు వచ్చినా రైతులకు ఇంకా ఇబ్బందులు తప్పడం లేదు. వానాకాలం సీజన్ సాగుకు సన్నద్ధం కావాల్సిన రైతులు యాసంగి ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల అకాల వర్షాలు, వడగళ్ల వానలతో ధాన్యం తడిసి ఇబ్బందులు పడుతున్న రైతులకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో మరింత ఆందోళనలు ఏర్పడ్డాయి. అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ పరిస్థితుల్లో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని తరలించాలంటూ జిల్లాలోని పలు చోట్ల రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు కూడా ధాన్యానికి బోనస్ ఇవ్వాలంటూ ఆందోళనలు, నిరసనలు తెలిపిన సందర్భాలు ఉన్నాయి. మరోవైపు తరుగు పేరిట రైతులకు కోతలు తప్పడం లేదు.

● కొనుగోలు లెక్కతప్పింది

జిల్లాలో యాసంగిలో 1.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వరిసాగులో గంభీరావుపేటలో 17,318 ఎకరాలు, ఇల్లంతకుంట 25,024, ముస్తాబాద్ 19,913, సిరిసిల్ల 4783, తంగళ్లపల్లి 18,851, వీర్నపల్లి 4204, ఎల్లారెడ్డిపేట 16,512, బోయినపల్లి 17,079, చందుర్తి 15,182, కోనరావుపేటలో 17141 ఎ కరాలు, రుద్రంగిలో 4112 ఎకరాలు, వేములవాడలో 5142 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 10487 ఎకరాల్లో సాగు చేశారు. దీని ద్వారా 3.81 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుంది. భూగర్భ జలాలు అడుగంటడం, అకాల వర్షాలతో దిగుబడిపై ప్రభావం చూపింది. మరో వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటి వరకు పౌరసరఫరాల శాఖ ద్వారా 2.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. 259 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన 95 కేంద్రాల్లోనే కొనుగోళ్లు పూర్తి చేశారు. 164 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇందులో 44 ఐకేపీ కేంద్రాల ద్వారా 42,631 మెట్రిక్ టన్నులు, 202 సింగిల్ విండోల ద్వారా 1,68,307 మెట్రిక్ టన్నులు, 9 డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా 4886 మెట్రిక్ టన్నులు, నాలుగు మెప్మా కేంద్రాల ద్వారా 2872 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. పౌరసరఫరాల శాఖ పెట్టుకున్న లక్ష్యం నెరవేరే పరిస్థితులు లేవు.

● రూ.481.79 కోట్ల విలువైన ధాన్యం

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 32,857 మంది రైతుల నుంచి 2,18,699 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం విలువ 481.79 కోట్లు ఉంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 31,165 మంది రైతుల ధాన్యానికి సంబంధించిన వివరాలు పొందుపర్చారు. 31,417 మంది రైతులకు 1,75,980 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.387.68 కోట్లు చెల్లించారు.

భగ్గుమన్న బీఆర్‌ఎస్ శ్రేణులు



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇచ్చారని, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సన్నరకాల వడ్లకే బోనస్ ప్రకటించడంపై జిల్లా వ్యాప్తంగా మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం అయ్యాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వద్ద నియోజకవర్గ స్థాయిలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ మార్కెట్ యార్డు ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. వీర్నపల్లి ఇతర మండలాల్లో నిరసనలు తెలిపారు. అన్ని రకాల వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బద్దిపోచమ్మ ఆలయంలో బారులుదీరిన భక్తులు

వేములవాడ టౌన్, మే 21 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ఒడిబియ్యం, నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి బలి ఇచ్చేందుకు పొట్టేలును తీసుకొచ్చిన భక్తుల నుంచి కళ్ల సాక పట్టేందుకు రూ. 50 నుంచి వంద వసూలు చేయడంతో చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో భక్తుల వద్ద ప్రైవేటు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

గడువులోగా విద్యార్థుల యూనిఫాం అందించాలి



యూనిఫాం పరిశీలిస్తున్న అడిషినల్ డీఆర్డీవో

ఇల్లంతకుంట, మే 21: నిర్ణీత గడువులోగా పాఠశాల విద్యార్థుల యూనిఫాం అందించాలని అడిషినల్ డీఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని గాలిపెల్లి, కందికట్కూర్ గ్రామాల్లోని కుట్టు శిక్షణ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుస్తులు కుట్టడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సభ్యుల సంఖ్య పెంచుకోవాలని, జూన్ 10లోగా ఒక జత యూనిఫాం అందించాలని సూచించారు. ప్రతీ రోజు ఎన్ని కుడుతున్నారో అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. డీపీఎం సుధారాణి, ఏపీఎం వాణిశ్రీ, సీసీలు వెంకటేశం, రాంచంద్రారెడ్డి, రాజేశ్వరి, వీవోఏలు, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారు చేస్తున్న విద్యార్థుల యూనిఫాం తయారీ సకాలంలో పూర్తి చేయాలని డీపీఎం పద్మయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లిలోని సద్గురు సాయి, స్వర్ణపూజిత మహిళా శక్తి సంఘాల నేతృత్వంలోని మహిళలు తయారు చేస్తున్న కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా దుస్తులను తయారు చేయాలని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పని తీరు, పుస్తకాల నిర్వహణ, మహిళల రుణాలుపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగపర్చుకునేలా చూడాలని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పాటు పడాలని కోరారు. ఏపీఎంలు రాజేశం, మల్లేశం, సీసీలు మంగ్యానాయక్, సుదర్శన్, రమణ, నాగరాజు, దేవేందర్, సుధాకర్, పద్మ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 21 : దుబాయిలో పనులు చేస్తున్న తెలంగాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి దుబాయి ఎంబసీ అధికారులు సహకరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ఐదు రోజుల దుబాయి పర్యటనలో భాగంగా మంగళవారం దుబాయిలోని కౌన్సిలేట్, అబుదాబిలోని ఎంబసీ అధికారులను కలిసి తెలంగాణ కార్మికుల సమస్యలను వారికి వివరించారు. కోనరావుపేట మండలం నిమ్మపెల్లికి చెందిన శ్రీకాంత్ గతంలో మిస్సింగ్ అయ్యాడని సంబంధిత అధికారులను కలిసి దుబాయి పోలీసులకు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. జగిత్యాల జిల్లా మొత్కురావుపేట గ్రామానికి చెందిన భూమల్ల గణేష్ మృతదేహాన్ని త్వరగా రాష్ట్రానికి పంపాలని ఎంబసీ అధికారుల దృష్టికి తీసుకురావడంతో మూడు రోజుల్లో మృతదేహాన్ని తెలంగాణకు పంపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన వంశీ కేసులో ఇరుక్కుని జైలు జీవితం గడుపుతున్నాడని తెలిసి కుటుంబ సభ్యులతో ఒకసారి వీడియో కాల్‌లో మాట్లాడించాలని ఎంబసీ అధికారులను కోరారు. తెలంగాణకు సంబంధించిన కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరినట్లు పేర్కొన్నారు.

రైతుల పేరిట రాజకీయం మానుకోండి

వేములవాడ టౌన్, మే 21: గతేడాదిమేలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ కొనుగోలు చేసిన ధాన్యం లక్ష 23 వేల 781 మెట్రిక్ టన్నులైతే ఈ సంవత్సరం తాము ఇప్పటి వరకు 2 లక్షల 24 వేల 523 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రైతుల పేరిట రాజకీయం చేయాలని చూస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫోన్ ద్వారా తెలిపారు. రైతుల గురించి ఆలోచిస్తున్న ఏకైక ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. రైతులు అధైర్యపడవద్దని కేంద్రాల్లోని ధాన్యాన్ని త్వరలో పూర్తిగా కొనుగోలు చేసేందుకు అధికారులకు సూచించామన్నారు. పది సంవత్సరాల కాలంలో గల్ఫ్‌కార్మికుల సమస్యలు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, గల్ఫ్‌కార్మికుల సమస్యల పరిష్కారానికి దుబాయి వచ్చానని, ఇక్కడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. కావాలని కొంత మంది రాజకీయం చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో తమకు మద్దతు ఇచ్చిన గల్ఫ్‌కార్మికులను కలుసుకుని ధన్యవాదాలు తెలిపానన్నారు. వారి సమస్యలు వింటే గుండెతరుక్కుపోతుందన్నారు. తనకు తోచినంత వరకు సంబంధిత అధికారులను కలిసి పనిభారం తగ్గించాలని కోరినట్లు వివరించారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఉపాధి కూలీ పని చేస్తుండగ మట్టి పెళ్లలు కూలి రాజవ్వ మృతి చెందడం బాధాకరమని అన్నారు. మృతిరాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించామన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

ఎల్లారెడ్డిపేట, మే 21: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని సింగారం, బండలింగంపల్లి, గొరింట్యాల, మల్లుపల్లె గ్రామాల్లో అధ్యాపకులతో కలిసి ఆయన మంగళవారం ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రవేటు కళాశాలల్లో పిల్లలను చేర్పించి ఆర్థికంగా నష్టపోకూడదని సూచించారు. అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మే 21: జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లోని దుమాల, మర్రిమడ్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో సీబీఎస్ఈ సిలబస్ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆర్‌సీవో వెంకన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 27లోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఘనంగా సుదర్శన నరసింహ హవనం

వేములవాడ టౌన్, మే 21 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో మంగళవారం సుదర్శన నరసింహ హవనం ఘనంగా నిర్వహించారు. ఉదయం పచసూకత అభిషేకం, పంచసూక్త హవనం మధ్యాహ్నం మహానివేదన, సుదర్శన నరసింహ హవనం, సాయంత్రం నిత్య పూర్ణాహుతి, బలిహరణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేపట్టారు.

గంగా భవానీ కల్యాణోత్సవం

ముస్తాబాద్, మే 21 : మండలంలోని పోత్గల్ గ్రామంలో గంగపుత్ర సామాజిక వర్గ ఆధ్వర్యంలో గంగభవానీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగాదేవతా పరమేశ్వరి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు పారిపెల్లి శ్రీనివాస్, రాజు, సత్యం, నర్సింలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

గంభీరావుపేట, మే 21: గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో లక్ష్మీనర్సింహాస్వామి 20వ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గుడి నిర్మాత వేముల లక్ష్మినర్సయ్య, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి మొదటి రోజు అభిషేకం, రెండవ రోజు హోమం, చివరి రోజు కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాత లక్ష్మీనర్సయ్య ఆలయ అర్చకులు పంచ రత్నాల మురళి, శ్రీమాన్ శేషబట్టర్ కృష్ణమాచార్య వేద పండితులు, గ్రామ ఎంపీటీసీ మెరుగు నాగభూషణం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

వేములవాడ రూరల్, మే 21: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకట్రాంపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామంలో అపరిచితులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు కొరత లేదు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 21: వానాకాలం సీజన్ సాగు కోసం జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు కొరత లేదని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సాగుపై వ్యవసాయ అధికారులు, పోలీసులు, డీలర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి 1.82 లక్షల ఎకరాలు, 50 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రైతులకు ఎరువులు దుకాణాల డీలర్లు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతీ డీలర్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, తమ దుకాణంలోని స్టాక్ వివరాలు బోర్డు పై ప్రదర్శించాలని, వాటి వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మవద్దని పేర్కొన్నారు.ప్రతి అమ్మకానికి సంబంధించి రసీదు రైతులకు అందజేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు కూడా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. రైతులు డీఏపీ వాడాలని పిలుపునిచ్చారు. నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. పోలీసులు, వ్యవసాయ అధికారులు, దుకాణాల డీలర్లు కలిసి వీటిని అరికట్టాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బాగుంటేనే అందరం బాగుంటామని వివరించారు. అనంతరం డీలర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

గంభీరావుపేట, మే 21: గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలో మెరుగు రాజవ్వ (92) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. నిర్వాహకుడు నర్సయ్యగౌడ్ వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించారు. రాజవ్వకు భర్త, రక్త సంబంధీకులు లేక పోవడంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఇప్పటివరకు ఆశ్రమంలో 25 మంది చనిపోగా నరసయ్య గౌడ్ స్వయంగా దహన సంస్కారాలు నిర్వహిస్తూ వస్తున్నారు. నర్సయ్య గౌడ్ సేవా భావాన్ని పలువురు అభినందించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

పాలీసెట్‌కు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 21 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలతోపాటు పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలతోపాటు పాలిసెట్ నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయిచాలని, పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించాలని అన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ అధికారులు బస్సులను సమయానుకూలంగా నడిపించాలని, విద్యుత్ కోతలు లేకుండా సెస్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.

- ఉదయం ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్‌కు పరీక్షలు

జిల్లాలోని ప్రభుత్వం, ప్రైవేటు కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు హాజరుకానున్నారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 2222 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 1421 మంది హాజరుకానున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్ వారికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు సెకండ్ ఇయర్ వారికి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పాలిసెట్ నిర్వహణకు 7 కేంద్రాలు

ఈ నెల 24వ తేదీన జిల్లాలో పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. జిల్లాలో మొత్తం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. 1645 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల నిర్వహించనున్నట్లు చెప్పారు.

- 144 సెక్షన్ అమలు

ఇంటర్ సప్లమెంటరీ, పాలిసెట్ పరీక్ష కేంద్రాలవద్ద పోలీసులు 144సెక్షన్‌ను అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకిసెల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకరావద్దని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి మోహన్, డీఈవో రమేష్‌కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, ఎస్‌ఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది



పరామర్శిస్తున్న జడ్పీ చైర్ పర్సన్

కోనరావుపేట, మే 21: మండలంలోని వెంకట్రావుపేటలో ఉపాధిహామీ పనుల ప్రాంతంలో మట్టి పెళ్లలు పడి మృతి చెందిన కూలీ మారుపాక రాజవ్వ కుటుంబానికి, గాయపడిన మరో ఆరుగురు ఉపాధి కూలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. దుబాయ్ పర్య టనలో ఉన్న ఆయన మంగళవారం కలెక్టర్ అనురాగ్ జయంతి, సంబంధిత వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలని సూచించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మట్టిపెళ్లలు పడి మృతి చెందిన మారుపాక రాజవ్వ కుటుంబంతోపాటు, మరో ఆరుగురు కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి అన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధిహామీ కూలీలను మృతి చెందిన రాజవ్వ కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, వారికి అండగా నిలవాలని కోరారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఉపాధి కూలీల నేతల పరామర్శ

మృతి చెందిన ఉపాధి హామీ కూలీ రాజవ్వ కుటుంబంతోపాటు, మరో ఆరుగురు కూలీలను జిల్లా ఆస్పత్రిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కుమ్మరి దేవదాసు, బీజేపీ నాయకులు పరామర్శించారు.











విలీన ప్రక్రియ ముందుకు సాగేనా?

● దోలాయమానంలో ఆర్టీసీ ఉద్యోగులు ● ప్రభుత్వం స్పందించాలని వినతి

భగత్‌నగర్, మే 21: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినా ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. 2019 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులు విలీనం చేయాలని సమ్మె చేసినా ఆ దిశగా అడుగులు వేయని ప్రభుత్వం 2023 ఆగస్టు నెలలో ఒక్కసారిగా విలీన ప్రక్రియను ముందుకు తీసుకు వచ్చి మంత్రివర్గ సమావేశంలో చర్చించి బిల్లును ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించారు. విలీన బిల్లుకు సెప్టెంబరులో గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తంతు ముగిసినా విధి విధానాల రూపకల్పనకు ఓ కమిటీని వేసింది. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల కోడ్‌లతో విలీన ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు విలీన ప్రక్రియపై ఆశలు పెట్టుకున్నారు.



కరీంనగర్ రీజియన్‌లో 3,472 మంది ఉద్యోగులు

కరీంనగర్ రీజియన్‌లో 11 ఆర్టీసీ డిపోలు ఉండగా 3472 మంది ఉద్యోగులు ఉన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలు ఉన్నాయి. గోదావరిఖనిలో 524 మంది ఉద్యోగులు, హుస్నాబాద్‌లో 210, హుజూరాబాద్‌లో 253, కరీంనగర్-1 డిపోలో 423, కరీంనగర్-2లో 384, మంథనిలో 211, జగిత్యాలలో 435, కోరుట్లలో 226, మెట్‌పల్లిలో 231, సిరిసిల్లలో 266, వేములవాడలో 250 మంది ఉద్యోగులతో పాటుగా మిగతా 59 మంది కలుపుకుని 3472 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తయితే రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల పరిధిలోని ఉద్యోగులందరికీ లాభం జరిగే అవకాశం ఉంది.

ఆందోళనలో రిటైర్డ్ ఉద్యోగులు

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ప్రభుత్వం విలీన ప్రక్రియ గెజిట్ పబ్లిష్ చేసిన తర్వాత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విలీన ప్రక్రియ ముగిసిన తర్వాత తమకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రావాల్సిన మొత్తాలను అందించాలని రిటైర్డ్ అయిన ఉద్యోగులు కోరుతున్నారు. గత సెప్టెంబర్ నెలలో 8 మంది, అక్టోబర్ నెలో 8 మంది, నవంబర్ నెలలో 8, డిసెంబర్ నెలలో 11 మంది, జనవరి నెలలో 15 మంది, ఫిబ్రవరి నెలలో 10, మార్చి నెలలో 13 మంది, ఏప్రిల్ నెలలో 20 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. గత సంవత్సరం విలీన ప్రక్రియ గెజిట్ విడుదల అయినప్పటి నుంచి ఇప్పటి వరకు 93 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.



జూలై 3 నుంచి ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీని జూలై 3 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. 3ఏఎస్‌సీ ఎయిర్‌ఫోర్స్ సంస్థ ఖాన్‌పూర్, 7ఏఎస్‌సీ, 1 కబ్బన్‌రోడ్, బెంగుళూరు కర్ణాటకలో నిర్వహించనున్న ఈ ర్యాలీలో పాల్గొనటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెళ్లి కాని భారతీయ పురుషులు, మహిళల కోసం అగ్నివీర్ వాయు కోసం రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తుం దన్నారు. దీనికి సంబంధించి ఇంటెక్ 01/2025 రిక్రూట్‌మెంట్ కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో క్లరికల్/టెక్నికల్ క్యాడర్లలో ఉద్యోగావకాశాలు ఇపుడు నాలుగు సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, అభ్యర్థులలో 25శాతం మందికి శాశ్వత ప్రవేశం కల్పించ బడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థి అవివాహితుడై, 2జనవరి, 2004 నుంచి 2 జూలై 2007 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత/సమాన విద్య కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు టెంపో, పిచ్, ఒక పూర్తి పాట పాడడంలో కచ్చితత్వంతో సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 ఉదయం 11 గంటల నుంచి జూన్ 5 వరకు రాత్రి 11 గంటల వరకు వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



పోగొట్టుకున్న ఫోన్ అందజేత

జగిత్యాల టౌన్, మే 21:జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎల్లాల గోపాల్ రెడ్డి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గోపాల్ రెడ్డి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ట్రేస్ చేసి రికవరి చేశారు. మంగళవారం బాధితుడికి సీఐ వేణు గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. టౌన్ ఎస్సై నరేష్, మన్మథరావు ఉన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

సిరిసిల్ల క్రైం, మే 21: సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో మంగళవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొంది. మానేరువాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సాయినగర్ రోడ్డుపై వెళ్తోంది. అజాగ్రత్తతో అతివేగంగా డ్రైవింగ్ చేయడంతో అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు స్తంభాలు విరిగి కిందపడ్డాయి. తీగలు తెగిపోయాయి. దీంతో ఆ కాలనీలోని పలు ఇళ్లల్లో టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు ఒక్కసారిగా కాలిపోయాయి. ఏం జరిగిందోనని ప్రజలు ఆందోళన చెందారు. ప్రమాదం జరిగిన కొంత సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లన్నీ సాయినగర్ కాలనీలో నిలిచిపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ప్రతీ రోజు ఇసుక రవాణాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చేశారు. ఈ సంఘటన తెలుసుకున్న సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరణలో నిమగ్నమయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ సమీపంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపారని పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని చెప్పారు. నారాయణపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోదరి రాకేశ్, వాహన యజమాని గోగూరి ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.





భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



ఆలయం ఎదుట భక్తులు

మల్యాల, మే 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవుల నేపథ్యంలో సోమవారం రాత్రికే వేలాదిగా కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య ఇతర అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. కాగ కొండ పైన అలిశెట్టి విష్ణు అనే భక్తుడు సెల్‌ఫోన్, నగదుతో కూడిన బ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సిబ్బందితో వెతికి భక్తుడికి అప్పగించారు.

రూ. 7,400 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, మే 21: జమ్మి కుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 22 మంది రైతులు 270క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఏడు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర ఐదు వేలు చెల్లించి కొన్నారు.

వివాహిత హత్య



మమత (ఫైల్)

మెట్‌పల్లి, మే, 21 : మెట్‌పల్లి పట్టణానికి చెందిన సంగం మమత(38)అనే మహిళ మంగళవారం హత్యకు గురైంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన సంగం మమత కొంత కాలంగా అబ్దుల్ అఫ్సర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం నడిపిస్తోంది. మమత తన భర్తతో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుని కొడుకు, కూతురుతో కలిసి పట్టణంలోని వేరుగా ఉంటోంది. అఫ్సర్ తరుచుగా మమత ఇంటికి వస్తూ ఉండే వాడు. సోమవారం రాత్రి మమత, అఫ్సర్‌ల మధ్య గొడవ జరిగింది. అఫ్సర్ కోపంతో మమ తను గొంతు నులిమి, కత్తితో పొట్టలో పొడవడంతో తీవ్ర రక్తస్రావంతో పడిపోయిం ది. గమనించిన కూతురు 108లో ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందిన ట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. మమత కూమారుడు సంగం గ్రహిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం



ధర్మపురి, మే 21: ధర్మపురి మండలంలోని రాయపట్నం నది బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గల మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

శంకరపట్నం, మే 21: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతు (70) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతుకు అతని తమ్ముడు బొంతల సమ్మయ్యతో భూవివాదం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సమ్మయ్య హన్మంతును, అతని కుటుంబ సభ్యులను తిడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో హన్మంతు మనస్తాపానికి గురై ఈ నెల 18న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందతూ మృతి చెందాడు. మంగళవారం హన్మంతు కుమారుడు బొంతల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, మే 21: మండలంలోని విలాసాగర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నాగంపేట గ్రామం వద్ద హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, పెట్రోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా విలాసాగర్ మానేరు నుంచి వస్తున్న రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీల యాజమానులు వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చందుపట్ల జితేందర్‌రెడ్డి, వేములవాడకు చెందిన ముద్రకోల మహేష్, డ్రైవర్లు జాన ప్రశాంత్, ఎరుకల అంజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

రుద్రంగి మే 21: మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సాన్ని సృష్టించిన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం మానాల గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్తున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్టాండ్ ప్రాంతంలోని డివైడరును ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

మానకొండూరు, మే 21: మండలంలోని అన్నారంలో మంగళవారం ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి కరీంనగర్ నుం చి మండలంలోని అన్నారం గ్రామానికి వరివిత్తనాలతో వ్యాన్ బయలు దేరింది. అన్నారం గ్రామంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మే 21: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పరిధిలోని వేంనూర్ గ్రామంలో సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడిన దీకొండ మహేందర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. మహేందర్ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

మల్లాపూర్, మే, 21 : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని వాకిటి గంగవ్వ మారు రాజశ్రీల ఇళ్లల్లోకి పిచ్చికుక్క చొరబడి దాడి చేసిన ఘటనలో మంగళవారం ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపి న వివరాల ప్రకారం..గ్రామంలో మధ్యాహ్నం వాకిటి గంగవ్వ అను వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయంలో పిచ్చికుక్క ఇంట్లోకి చొరబడి గంగవ్వ ముఖంపై, ఎదురింట్లో ఉన్న మారు రాజశ్రీ కాళ్లను కొరికి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు, కుంటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని వారిని ఆసపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు



నరసింహ స్వామివారు

ముగిసిన నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 21: ధర్మపురి క్షేత్రంలో శ్రీ నరసింహ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారం భమైన నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ముఖ్య అర్చ కులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుష సూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసక పూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. పంచోపనిషత్తులతో మన్యసూక్తం, నున్నాల వన్నము, రుద్రంతో అభిషేక పూజలు, విశేష పూజ లు, పంచోపనిషత్తులో అభిషేకం, సహస్ర నామా ర్చన, హారతి, వేద మంత్ర పుష్పం, చతుర్వేద అవధార్యాలు, ప్రత్యేక పూజలు, సప్త హారతులు నిర్వహించారు.

సాయంత్రం వేళలో స్తంభోద్భవ కాలంలో విశేష పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాల కు, శ్రీ స్వామి వారలకు, దేవాల యాల కు ప్రత్యేక పూల అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నిత్యం మూడు వాటర్ కూలర్స్‌తో పాటు అదనంగా మరో రెండు చోట్ల లడ్డూ కౌంటర్ ముందు, దేవాలయం ఎదుట చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోదావరిలో స్నానాలు చేసిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారలను దర్శిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ వేదపండి తులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి, దర్శనం చేసుకున్నారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించి, స్వామి తీర్థ, ప్రసాదాలు అందించారు.







స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, స్వామి వారలకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామి వారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి

కేడీసీఏ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



క్రీడాకారుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మురళీధర్ రావు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: జిల్లా క్రీడాకారులు క్రికెట్ శిక్షణ శిబిరాలలో నేర్చుకున్న మెళ కువలతో ముందు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీధర్ రావు అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారం ఉదయం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ ప్రధాన మైదానంలో గత నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమ వారం ఉదయం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను, శిక్షణ శిబిరాలు నిర్వ హిం చిన కోచ్‌లకు మెమెంటోను ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడా కారులు క్రమ శిక్షణకు మారు పేరుగా నిలవాలన్నారు. నెల రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న అండర్ 14,16,19,23, వయసు విభాగాల బాల బాలికలకు ప్రశం సాపత్రాలను అందించారు.

మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రాయికల్, మే 21: మండలంలోని మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రాయికల్ నుంచి కోరుట్లకు ధాన్యం తీసుకువెళ్తున్న లారీ మైతాపూర్ బ్రిడ్జిపైకి రాగానే బోల్తా పడింది. మైతాపూర్ బ్రిడ్జిపై ఇటీవల కాంట్రాక్టర్ మట్టి పోయడంతో మట్టిలో దిగబడి లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్లు తురగ శ్రీధర్, వల్లకొండ మహేష్ గౌడ్, రైతులు బోల్తా పడిన లారీని, ధాన్యం బస్తాలను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుందని, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. బ్రిడ్జి పనులు నడుస్తున్నాయని హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే పనులు నడుస్తున్నప్పుడు వాహనాలు వెళ్లడానికి కనీసం మట్టి రోడ్డు నిర్మాణం చేయలేదన్నారు. ఎక్కువ గుంతలు ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్లు మట్టి రోడ్డు నిర్మాణం చేయించి, బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

వడదెబ్బతో కౌలు రైతు మృతి



సుల్తానాబాద్, మే 21 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంట పల్లి గ్రామానికి చెందిన పోలాడి నర్సింగరావు (70) అనే రైతు వడదెబ్బతో మృతిచెందాడు. తాను కౌలుకు తీసుకున్న 2 ఎకరాల్లో సోమవారం పెసర్లు అలికి ఇంటికి రాగా, ఎండ తీవ్రతకు అస్వస్థత గురయ్యాడు. మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఇంటికి రాగా సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య గతంలో మృతిచెందగా, పిల్లలు లేరు.

ఠాణా ఎదుట ఎస్సై భార్య ఆందోళన

● రెండో పెళ్లి చేసుకొని.. తమకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన





కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న మానస, మానస, పిల్లలతో ఎస్ఐ నాగరాజు (ఫైల్)

చేర్యాల, మే 21 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై నాగరాజు తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, పిల్లలను బలవంతంగా తీసుకెళ్లాడని అతడి మొదటి భార్య మానస మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదుట తల్లి, బంధువులతో కలిసి ఆందోళనకు దిగింది. నాగరాజు రెండో భార్య వల్ల తనకు, తన పిల్లలకు ప్రాణ హాని ఉందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

కరీంనగర్ జిల్లా గోపాల్ పూర్‌కు చెందిన మానసకు కొమురవెల్లి ఎస్సై నాగరాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఎస్సై నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసను వేధిస్తున్నాడు. కొంతకాలం క్రితం మానసను, పిల్లలను కరీంనగర్‌లో ఉంచాడు. అప్పుడప్పుడు అక్కడికి వచ్చి పోయేవాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల క్రితం బలవంతంగా పిల్లలను తీసుకెళ్లి.. వాళ్లు ఎక్కడున్నారో మానసకు చెప్పకుండా విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. దీంతో మానస ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆమె సూసైడ్ నోట్ రాసి పెట్టుకోగా గమనించిన కుటుంబ సభ్యులు కలుగ జేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో విరమించుకుంది. తన భర్త విషయాన్ని సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోతోంది. తనకు, తన ఇద్దరు పిల్లలకు ఎస్సై నాగరాజు రెండో భార్యతో ప్రాణహాని ఉందని, నాగరాజు, పిల్లలు తనతో కలిసి ఉండేలా న్యాయం చేయాలని ఆమె మంగళవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగింది. అయితే, ఎస్సై నాగరాజు సెలవులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. తనకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించనని అక్కడే కూర్చుంది. ఈ విషయమై సీఐ శ్రీనును సంప్రదించగా, విషయాన్ని మానస ఇటీవల తన దృష్టికి తీసుకువచ్చారని.. కౌన్సెలింగ్ చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్



గణేశ్‌నగర్, మే 21: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న వీసీ పదవీ కాలం పూర్తి కావడంతో ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. కొత్త వీసీలు నియమితులు అయ్యే వరకు వీరు విధుల్లో కొనసాగనున్నారు. ఇప్పటికే కొత్త వీసీల కోసం యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి

జగిత్యాల టౌన్, మే 21: జిల్లా కేంద్రంలోని 10వ వార్డులోని లింగంపేట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నిమ్మని శిరీష తన కూతురు విన్మయి(3)తో కలిసి లింగంపేటలో ఎల్లమ్మ పట్నాల కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం శిరీష నడుపుతున్న వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో వాహనంపై ఉన్న చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన జగిత్యాలలోని ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలకుర్తిలో వ్యక్తి..

పాలకుర్తి, మే 21: మండల పరిధిలోని ఎయిర్‌పోర్టు సమీపంలో మంగళవారం జరిగిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో జయ్యారం గ్రామానికి చెందిన జంగ శంకర్(40) మృతిచెందాడు. ధర్మారం ఎక్స్‌రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొత్తపల్లి గ్రామం నుంచి ఎక్స్‌రోడ్డుకు వెళ్తున్న పోతు నరేష్ ద్విచక్రవాహనంపై వచ్చి బలంగా ఢీకొట్టడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య శిరీష, కూతూరు వైష్ణవి, కుమారుడు చర్రి ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చొప్పదండి, మే21: చొప్పదండి మండంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బైరగోని ఆనందం(45) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు బైరగోని ఆనందం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆరునెలలుగా వ్యాపారం నడవకపోవడంతో నష్టాలపాలై జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున ఇంటిముందు బాల్కని ఇనుప చువ్వకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు వచ్చి తరచు బాదపడుతుండే వాడని, ఆనందం భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ రూరల్, మే 21: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. ఎదురుగట్ల గ్రామంలో అదే గ్రామానికి చెందిన పస్తం శ్రీనివాస్ ఆటోలో అక్రమంగా 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తర లిస్తుండగా మంగళవారం రూరల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలుంటాయని ఎస్సై హెచ్చరించారు.

రాయికల్‌లో భారీ చోరీ

సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

రాయికల్, మే 21: రాయికల్ పట్టణంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణానికి చెందిన బుడిక విజయలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం బంధువుల ఇంటి నుంచి తన ఇంటికి చేరుకున్న విజయలక్ష్మికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండ టంతో అనుమానంతో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి ఇంట్లోకి వెళ్లింది. ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండగా, అందులో ఉన్న సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు మాయం కావడంతో చోరీ జరిగినట్లు గ్రహించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై అజయ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వివరాలు సేకరిస్తున్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

సుల్తానాబాద్, మే 21 : మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య(55) అనే గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. రోజువారిగా మంగళవారం కూడ అంజయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. వ్యవసాయ బావి దగ్గర గొర్రెలు మేస్తుండగా పక్కనే ఉండి గమనిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడి మృతిచెందాడు. అంజయ్యకు భార్య కేతమ్మతో పాటు కుమారుడు ఉన్నాడు. కేతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ధాన్యం త్వరగా అన్‌లోడ్ చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 21 : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని త్వరగా అన్‌లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, సీఎంఆర్ డెలివరీపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 33,667మంది రైతుల నుంచి 2,24,253 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.387 కోట్ల డబ్బులు జమ చేశామని తెలిపారు. రైస్ మిల్లర్ల తమ లక్ష్యం మేరకు ధాన్యాన్ని తీసుకోవాలని ఆదేశించారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా లోని రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ ఆలయ వార్షికోత్సవం


సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మే 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ వార్షికోత్సవాలను పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొంగళ్ల ఉమాశంకర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అనసూయ, ఎంపీడీవో సత్తయ్య, వివిధ పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. పద్మశాలి సేవ సంఘానికి రూ.35 వేల విలువైన కుర్చీలను అందించిన ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి- లహరి దంపతులను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, కోశాధికారి బాలరాజు, సంయుక్త కార్యదర్శి అంబదాస్, యు వజన సంఘం అధ్యక్షుడు భాస్కర్, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి విష్ణు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి
పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ఇల్లంతకుంట, మే 21: మండల కేంద్రంలో ఈనెల 23నుండి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. దోస్తీ మీట్‌లో భాగంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలలో ప్రథమ బహుమతిగా రూ 10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల జట్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉమ్మడి మండల నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, మే 21: ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలం నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక ఫంక్షన్ హాలులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న బాలయ్య, గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్‌బాబు, ఉపాధ్యక్షులుగా ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా భరత్, రాజు, నారాయణ, జితేందర్, సలహాదారులుగా శంకర్, వేణు, నారాయణ, చంద్రయ్య, రాజారాం, సత్తయ్య ఎన్నికయ్యారు. సభ్యులు శంకర్, రాములు, సురేశ్, అంజయ్య, దామోదర్, స్వామి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

సిరిసిల్ల రూరల్, మే 21 : కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఉపాధి పనులు చేస్తుండగా మట్టి పెళ్లలు పడి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మారుపాక రాజవ్వ చనిపోయిందని ఆ కుటుంబంతోపాటు సంఘటనలో గాయపడిన కూలీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరం పద్మ, విమల డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని ఐద్వా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి పనులు చేస్తుండగా మట్టి పెళ్లలు కూలీ సంఘటనలో చనిపోయిన రాజవ్వకుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని, గాయపడిన వారికి ఖరీదైనవైద్యంతోపాటు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ

తంగళ్లపల్లి, మే 21: సీనియర్ నాయకుడు సామల మల్లేశం సంతాపసభ కరపత్రాన్ని తంగళ్లపల్లి మండలం నేరేళ్ల గ్రామంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జూన్ 3వ తేదీన సిరిసిల్ల పట్టణం కార్మిక క్షేత్రం బద్దం ఎల్లారెడ్డినగర్‌లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమ నాగరాజు, పల్లె మహేష్, గందంనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

ఎల్లారెడ్డిపేట, మే 21: పోరాడి సాధించుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల విద్యార్థుల ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో కొన్నేళ్లుగా పోరాటం చేశామన్నారు. ఇంటర్ పూర్తి చేసిన తమ పిల్లలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్కారు డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులు చేర్పించాలని కోరారు. తరగతి గదులు, ల్యాబ్, బోధన సిబ్బందికి సరిపోయేలా తాత్కాలికంగా భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బోధన సిబ్బందిని నియమించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కళాశాల నిర్వహణ, ప్రయోగశాల, సామగ్రి కోసం ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేయాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు శాశ్వత భవనం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మించాలని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. నాయకులు ఆ సంఘం సోషల్ మీడియా రాష్ట్ర కో- కన్వీనర్ శివ, నాయకులు నవీన్, శివప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, మే 21: భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇల్లంతకుంట బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లిన ఘనత రాజీవ్‌గాంధీకి దక్కుతుందన్నారు. ఆయన ఆశయాల సాధనకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవ రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, ఎంపీటీసీ స్వప్నకర్ణాకర్ రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజునాయక్, బాబు, రాములు, రాజు, రాజయ్య, మల్లారెడ్డి, రఫీక్, దేవయ్య, రవి, బాల్‌రెడ్డి, కిషన్, శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, పర్శరాములు, నవీన్ నాయక్, గోపాల్, రాంచందర్‌నాయక్, రామచంద్రం, బాలయ్య పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా రాజీవ్‌గాంధీ ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుండంనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, కొండం రాజిరెడ్డి, శీల ప్రశాంత్; ఆగుళ్ల రాజేశం, ఎదేనూరి భానుచందర్,షాదుల్‌పాష, ఉచ్చిడి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ నాయకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి, నేరేళ్ల నర్సింగం గౌడ్, మోర కిరణ్, సత్యనారాయణరెడ్డి, చుక్క శేఖర్, ఏగుర్ల ప్రశాంత్, ఇటిక్యాల మహేందర్, సామల రమేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్‌రెడ్డి, లింబయ్య, నిత్యానందం, గోవర్ధన్, ప్రకాష్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలోని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నందికమాన్ చౌరస్తా సమీపంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి మంగళవారం కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులు చిలుక రమేష్, కనికరపు రాకేష్, అక్కనపల్లి నరేష్, దుర్గం పర్శరాములు, పీర్ మహ్మద్, కొక్కుల బాలరాజు, అరుణ్‌తేజచారి తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని నూకలమర్రి గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ కార్యకర్తలతో కలిసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరుశరాములు, పొత్తూరు సంపత్, రోమాల ప్రవీణ్, దొంతుల సంజీవ్, పొత్తూరు రాజు, సుంకపాక శంకర్, నాగుల మహేష్, జిట్టవేని మహేష్ బొడ్డు శ్రీనివాస్, సామర్ల కమలాకర్, రోమాల దుబ్బయ్య, రోమాల అంజనీకుమార్, పొత్తూరు అజయ్, జగదీష్, దుబ్బయ్య, అంజి, మహేష్‌ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పులి సత్తయ్య, బొజ్జ మల్లేశం, శ్రీనివాసరెడ్డి, చంద్రం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నీవాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ఎర్రం గంగా నర్సయ్య, గండి నారాయణ, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, పూదరి మహిపాల్, స్వర్గం పరందాములు, సూర యాదయ్య, దాసు, తదితరులు పాల్గొన్నారు

బోయినపల్లి: బోయినపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకలు పాల్గొన్నారు.


వేములవాడ పట్టణంలో..


ముస్తాబాద్‌లో..


తంగళ్లపల్లిలో...

గతంలో కంటే రెట్టింపు కొనుగోలు

రుద్రంగి, మే 21 : గత సంవత్సరం బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం కంటే రెట్టింపు ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందని జడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ ఉనికి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతేడాది సింగిల్ విండో ఆధ్వర్యంలో 24 వేల క్వింటాళ్లు కొనుగోలు చేయగా ప్రస్తుత సంవత్సరం 26 వేల క్వింటాళ్లు తరలించినట్లు చెప్పారు.

రుద్రంగి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ శ్రీలతను కాంగ్రెస్ నాయకులు కలిశారు. లారీల సమస్య ఉందని, లారీలు రైస్ మిల్లుల వద్ద త్వరగా అన్ లోడ్ అయ్యేలా చూడాలని కోరారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎర్రం గంగ నర్సయ్య, నారాయణ, కేశిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేశ్, తర్రె లింగం, దాసరి గంగరాజం, దాసు, స్వర్గం పరందాములు ఉన్నారు.

ఎల్లమ్మ సిద్దోగంలో కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, మే 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో జరిగిన ఎల్లమ్మ సిద్దోగం వేడుకల్లో సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారంగౌడ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ సిద్దోగ వేడుకల్లో భాగంగా రేణుక, జమదగ్నిల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఎల్లమ్మ పట్నాలు, నాగవెల్లి, సిద్ధులు తిరుగుట, గావు పట్టు, ఒడిబియ్యం పోయుట, వంటి కార్యాక్రమాలను కోలహాలాల మధ్య నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కేకే మహేందర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయాలు సంస్కృతి సంప్రాదాయలకు ప్రతీకలని పేర్కొన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు మేర్గు అంజాగౌడ్ కేకేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండం రాజిరెడ్డి, రంజానీ నరేష్, దీకొండ ధశరథం, నవీన్, చంద్రశేఖర్, కిరణ్‌గౌడ్, శ్రీరామ్, అంజయ్య, నర్సాగౌడ్, కోమురయ్య, భాను, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, మే 21: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలో వేముల గౌతం చంద్ (16) అనే విద్యార్థి మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని వెంకంపేటకు చెందిన వేముల శ్రీనివాస్, కమల దంపతుల కుమారుడైన గౌతం చంద్ ఇంట్లోనే తన పడకగదిలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాత్రి కావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మంత్రి అమెరికాలో.. ఎమ్మెల్యే దుబాయిలో


మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనిర్సంహారావు

వేములవాడ టౌన్, మే 21 : రైతుల సమస్యలను గాలికి వదిలేసి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికాకు, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దుబాయి వెళ్లారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనిర్సంహారావు ఆరోపించారు. వేములవాడ పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ క్యాబినేట్ సమావేశం నిర్వహించి రైతులకు అందించబోయే సంక్షేమ పథకాలు వివరించడంలో విఫలమైందని విమర్శించారు. రైతుబంధును రైతు భరోసాగా అందజేస్తామని ఎన్నికల్లో హామీచ్చి ఇప్పుడు మంత్రులు మాట దాటవేసే సమాధానం ధోరణిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అకాల వర్షానికి రైతులు నష్టపోతే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతీ విషయాన్ని ముందస్తుగా వెల్లడించే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దుబాయి ఎందుకు వెళ్లారో ప్రజలకు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు తంటాలు పడుతుంటే విదేశీ పర్యటనపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉంటుందన్నారు. ఆంధ్రపాలకు సమయంలో రుద్రంగి ప్రాంతం నుంచే రెండు వేల మందికిపైగా గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లేవారని గుర్తు చేశారు. మరోసారి కరువు ప్రాంతంగా చేసి గల్ఫ్‌బాట పట్టేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. అంతే కాకుండా ముంపు గ్రామాల ప్రజలకు రూ. 5 లక్షల 4 వేలు ఎప్పుడు ఇస్తారన్నారు. సమావేశంలో నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, క్రాంతి, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, గోలి మహేష్, కమలాకర్‌రెడ్డి, వెంగళ శ్రీకాంత్, ఈర్లపెల్లి రాజు, సందీప్ తదితరులు ఉన్నారు.

పోలీసు కుటుంబాలకు బాసటగా నిలుస్తాం


చెక్కు అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 21: పోలీసు కుటుంబాలకు బాసటగా నిలుస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో పనిచేసిన హెడ్‌కానిస్టేబుల్ అంజయ్య కుటుంబానికి రూ.1.80లక్షల చెక్కును అందజేశారు. 1995బ్యాచ్‌కు చెందిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఏఆర్ సిబ్బంది నగదు జమచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, మల్లేశం, ప్రభాకర్, బాలు, మనోజ్, అంజయ్య కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ టౌన్, మే 21: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ హెచ్చరించారు. వేములవాడ మండలం రుద్రవరంలో మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామస్థులతో కలిసి గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. మాజీ సర్పంచ్‌లు ఊరడి రాంరెడ్డి, పిల్లి కనుకయ్య నాయకులు వంకాయల భూమయ్య, రాజిరెడ్డి, హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ప్రభాకర్

కొడిమ్యాల, మే 21: కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇదె కళాశాలలో ఈసీఈ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి. ప్రభాకర్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డా.. కె.వెంకటేశ్వర్‌రావు సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఉన్న కామాక్షిప్రసాద్ జేఎన్‌టీయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. నాచుపల్లి జేన్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ డా..టి.వేణుగోపాల్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా నియామకం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తంగళ్లపల్లి, మే 21 : తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ గ్రామం భరత్‌నగర్‌లో ఇటీవల పిడుగుపాటుతో మృతిచెందిన రుద్రారం చంద్రయ్య కుటుంబాన్ని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్, నాయకులు వైద్య శివప్రసాద్, కట్కుం రాజు, ఎంపీటీసీ భైరినేని రాము, ఎట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● మండలంలోని ఇందిరమ్మ ఇకాలనీకి చెందిన ఫాతిమా కొద్దిరోజుల క్రితం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ పరామర్శించారు. 50 కేజీల బియ్యాన్ని వితరణ అందించారు. నాయకులు కొంపల్లి శ్యాం, గడ్డం కిరణ్, ప్రశాంత్, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గౌస్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి మంగళవారం అందజేశారు. మండల కేంద్రంలోని మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలరాజుయాదవ్, అతని సోదరుడు మహేశ్‌యాదవ్ రూ.4 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, మహేందర్, బాబు, రాజయ్య, రాజునాయక్, మల్లారెడ్డి, రఫీక్, శ్రీనివాస్, పర్శరాములు, రాంచందర్‌నాయక్, ప్రతాప్‌రెడ్డి, రాజుకుమార్, రవి, బాల్‌రెడ్డి, కిషన్, రాములు పాల్గొన్నారు.

మల్లుపల్లెలో 12 గొర్రెలు మృతి

గంభీరావుపేట, మే 21 : గంభీరావుపేట మండలం మల్లుపల్లె గ్రామంలో బూరవేని దేవయ్య అనే రైతుకు చెందిన 12 గొర్రెలు మంగళవారం తర్ర గడ్డి వడ్లు తినడంతో మృతి చెందాయి. మొత్తం 37 గొర్రెలు తర్ర గడ్డి తిని తీవ్ర అస్వస్థకు లోనయ్యాయి. సమాచారం అందుకున్న సంబంధిత పశువైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని చికిత్స అందించారు. అప్పటికే 12 గొర్రెలు మృత్యువాత పడగా, మిగిలిన 25 గొర్రెలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ముస్తాబాద్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 21 : రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించడంతోపాటు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు మంగళవారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట సిరిసిల్ల నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం ఇప్పుడు సన్న రకానికి మాత్రమే ఇస్తామని మాట మార్చడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతాంగానికి అండగా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, ఎంపీపీ పడిగెల మానసరాజు, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, అగ్గిరాములు, మ్యానరవి, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అందె సుభాష్, దార్ల సందీప్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం చేపట్టారు. రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి సన్న రకానికి ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. వెంటనే రైతులు పండించిన ధాన్యానికి బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుగులోతు కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మహిళా మండలాధ్యక్షురాలు కళ, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. ప్రధాన గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు అన్నదాతలకు బోనస్ చెల్లిస్తామని పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతులను మోసగిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బోనస్ చెల్లించే వరకు రైతుల పక్షాన తమ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ అనసూయ, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, నాయకులు సుభాష్, రమేష్, శ్రీనివాస్, దేవరెడ్డి, నర్సయ్య, బాలాగౌడ్, అజిముద్దీన్, కిషన్, కృష్ణ, బాలరాజునర్సాగౌడ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు వెంటనే రూ.500 బోనస్‌ను అందించాలని, రూ.2 లక్షల రుణామాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ సర్వర్‌పాషా, తాడెపు ఎల్లం, చెవుల మల్లేశ్, శీలం స్వామి, సంతోష్‌రావు, భరత్, పూస బాలయ్య, జహంగీర్, కోడె శ్రీను, శీల తిరుపతి, మెంగని మనోహర్, గుండవేని సతీశ్, దొరగొల్ల బాలయ్య, నందు, గిరి తదితరులు పాల్గొన్నారు.


బొప్పాపూర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి


సిరిసిల్లలో బీజేపీ నాయకుల నిరసన దీక్ష

సిరిసిల్ల రూరల్, మే 21 : అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పిలుపుమేరకు రైతన్నల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపట్టిన రణభేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ కార్యాయలంలో నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ అతితక్కువ వ్యవధిలో రైతన్నల వ్యతికేకతను కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకుందన్నారు. రైతులను కన్నీరు పెట్టించిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాధించిన చరిత్ర లేదన్నారు. రైతులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ధాన్యం కొనుకోలు ప్రక్రియ అలస్యం చేస్తుండడంతో కేంద్రాల వద్ద దయనీయ పరిస్థితి ఉందన్నారు. దీనికి తోడు అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలైన దాఖలాలు లేవన్నారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూటకోమాట మాట్లాడుతోందన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. దీక్షలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వరెడ్డి, పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, నాయకులు శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, బుగ్గా రెడ్డి, బర్కం నవీన్‌యాదవ్, గుండెల్లి వేణుగోపాల్, నరేష్, సుంకరి బాలకిషన్, పంపరి అర్జున్, కోడం శ్రీనివాస్, అనంద్‌బాబు, బండారి వెంకటేశ్వర్లు, తాటిపాముల సత్యం, కాళీచరణ్, శ్రీనివాస్, వడ్నాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని బీజేపీ కార్యలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు అమలు కాని వాగ్ధానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ మోసం చేస్తోందన్నారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణస్వామి, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు నాయకులు రేగుల మల్లికార్జున్, సంటి మహేష్ పాల్గొన్నారు.


దీక్షలో జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ